RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 484 | 03,అక్టోబర్ శనివారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# పాఠశాలల్లో అల్పాహార పథకం..

## - సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

## : మంత్రి కోమటిరెడ్డి హామీ



తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని

# తిప్పికొట్టాలి

## : భట్టి విక్రమార్క



గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి

# చెమటలు పట్టిస్తాం

## : తలసాని



తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

## రేవంత్, కేటీఆర్ ఆస్తులపై

# విచారణ జరపాలి

## : ఎంపీ రఘునందన్ రావు డిమాండ్



తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని నేతలు దొంగలేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలని రఘునందన్ సవాల్ విసిరారు. ఒకవేళ వారు స్పందించకపోతే, తానే స్వయంగా హైకోర్టుకు లేఖ రాస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముగ్గురం కలిసి సిట్టింగ్ జడ్జికి విచారణ కోసం విజ్ఞప్తి చేద్దామని, తన ఆస్తులపైనా విచారణకు తాను సిద్ధమేనని ప్రకటించారు. ఇటీవల సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయగా, దానికి ప్రతిగా తమ ఇద్దరి కుటుంబాల ఆస్తులపైనా న్యాయ విచారణ జరిపించాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ కూడా ఈ అంశాన్ని తెరపైకి తేవడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## రాయలసీమ రైతుల తల రాతలు

# మారబోతున్నాయి

## : పవన్ కల్యాణ్



రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# మహనీయుల ఆశయాలే స్ఫూర్తిగా ముందుకు సాగాలి

## చిట్యాలలో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**



చిట్యాల: మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్ మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి మార్గాలను ఆచరిస్తూ మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారని అన్నారు. దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించిన గాంధీజీ సేవలు చిరస్మరణీయమన్నారు. అలాగే దేశ ఐక్యత, సమగ్రత కోసం విశేషంగా కృషి చేసిన మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి నిజాయితీ, నిరాడంబరతకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. దేశం కోసం వారు చేసిన త్యాగాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పింగళి జ్యోతి, జిల్లా స్పోక్స్‌పర్సన్ దొడ్డి కిష్టయ్య, జిల్లా నాయకులు చిలుకల రాయకోమురు, చిట్యాల టౌన్ అధ్యక్షుడు గంగాధర రవీందర్, సర్పంచ్‌లు కొడారి అశోక్, పర్లపెల్లి రవి, మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, ఉపసర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు ముద్దన నాగరాజు, సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, బుర్ర లక్ష్మణ్ గౌడ్, సిరిపురం కుమారస్వామి, కాల్వ లక్ష్మారెడ్డి, అరెపెల్లి నర్సింహా రాములు, కొర్రి మైసయ్య, క్యాతం మార్కండేయ, గ్రామ వార్డు సభ్యులు శనిగరపు మొగిలి, తీగల నాగరాజు, ఏకు కిషన్, గుర్రపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల డిమాండ్ల దినంగా గాంధీ జయంతి

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

భూపాలపల్లి: అక్టోబర్ 2

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) కార్యవర్గ సమావేశం నిర్ణయం, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాంధీ జయంతిని జర్నలిస్టుల డిమాండ్ల దినంగా శుక్రవారం పాటించారు. ఈ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో గాంధీ విగ్రహానికి యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపి, రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాన్ని టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సమంతుల శ్యామ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు అందజేసి రాష్ట్రపతికి పంపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. జర్నలిస్టులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేతన మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



తెలంగాణలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందించి నగదు రహిత వైద్య చికిత్స సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, చిట్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఐలయ్య, పుల్ల రవీందర్, సుబ్రహ్మణ్యస్వామి, సుధాకర్, రవి, కాత్రేవుల ఐలయ్య, శీలపాక ప్రణీత్‌కుమార్, నేరెళ్ల ఓదెలు, గుర్రం తిరుపతి, కట్కూరి రాజు, జీడి సురేష్, మాసు కుమార్, మైదం మహేష్, మ్యాదరి సునీల్, గొర్రె అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మాధవన్ జీ భగవతిపురంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 2:)**

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని భగవతీపురంలోని అవేర్ సంస్థల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యం, అహింస, సరళత, సేవ వంటి మహాత్మా గాంధీ ఆశయాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

పూజ్య శ్రీ మాధవన్ జీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, మాధవన్ జీ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ, మాధవన్ జీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, మాధవన్ జీ హాస్పిటల్ మరియు మాధవన్ జీ కేరళ ఆయుర్వేద హాస్పిటల్ కి చెందిన వైద్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ఎం.డి. పి. తరుణ్, పి.డి. పి. వరుణ్, అలాగే ప్రిన్సిపాళ్ డా. పి. సి. హనుమంతరావు, స్వేత, స్వాతి, ప్రిన్సిపాల్ మనోజ్ఞ, డైరెక్టర్ పి.హరి ప్రసాద్, ఎస్టేట్ మేనేజర్ వెంకన్న, మరియు కోఆర్డినేటర్ అమర్ నాథ్, హాజరయ్యారు.



ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. శాంతి, సత్యం, అహింస, నిస్వార్థ సేవ వంటి గాంధీజీ సందేశాలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ, విద్యార్థులు తమ దైనందిన జీవితంలో గాంధీజీ ఆశయాలను ఆచరిస్తూ, విద్య, వైద్యం, మానవతా దృక్పథం మరియు సమాజ సేవ ద్వారా దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు.విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది గాంధీ జయంతి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని సత్యం, అహింస, పరిశుభ్రత, క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యత వంటి విలువలను పాటించేందుకు తమ నిబద్ధతను చాటుకున్నారు.

మహాత్మా గాంధీ ఆశయాలు, విలువలు యువతకు నిరంతరం మార్గదర్శకంగా నిలిచి, శాంతియుతమైన, బాధ్యతాయుతమైన మరియు మానవతా విలువలు కలిగిన సమాజ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమం ముగిసింది.

# మహేశ్వరం మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 2**



మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ( కెఎల్ఆర్ ) మాట్లాడుతూ..జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి. 1869 అక్టోబర్ 2న జన్మించిన మహాత్మా గాంధీ 1948 జనవరి 30న మరణించారు. ఆయన జీవితమంతా సత్యం, అహింస, సేవ, స్వచ్ఛత, సమానత్వం వంటి విలువలకు అంకితం చేశారు.గాంధీజీ మనకు ఇచ్చిన గొప్ప సందేశంసత్యం, అహింస మార్గంలో నడుస్తూ సమాజానికి సేవ చేయడం. ఆయన చూపిన మార్గం ఒక్క రాజకీయ నాయకులకే కాదు, ప్రతి పౌరుడికీ ఆదర్శం.

మన గ్రామాలు, మన పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలి. ప్రతి ఒక్కరికీ గౌరవం, సమాన అవకాశాలు లభించాలి. పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఇదే నిజమైన గాంధేయ ఆలోచన.గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన,స్వావలంబనతో కూడిన గ్రామాలు నిర్మించడానికి మనమంతా మన వంతు బాధ్యతను నిర్వర్తించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం నుంచి, అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం వరకు ప్రతి చిన్న మంచి పని సమాజంలో పెద్ద మార్పుకు దారితీస్తుంది.ఈ గాంధీ జయంతి సందర్భంగా మనమందరం ఒక సంకల్పం చేద్దాంసత్యాన్ని పాటిద్దాం...అహింసా మార్గంలో నడుద్దాం...

పరిశుభ్రతను కాపాడుదాం...పేదలకు అండగా నిలుద్దాం...

సమాజంలో ఐక్యతను పెంపొందిద్దాం...

మన దేశ అభివృద్ధికి మన వంతు కృషి చేద్దాం.

మహాత్మా గాంధీజీ ఆశయాలను మన జీవితాల్లో ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.

ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆంగన్ వాడి కేంద్రం 2 లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు .

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**



చిట్యాల మండల కేంద్రంలోని అంగనవాడి చిట్యాల కేంద్రం 2 లో అంగనవాడి టీచర్ పుల్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జాతిపిత మహాత్మ గాంధీ గారి జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా గాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సత్యాగ్రహమే ఆయుధంగా అహింస మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులందరికీ స్వేచ్ఛ స్వాతంత్ర్యని అందించిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ఆయన దేశానికి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి ఆయన చూపిన మార్గంలో శాంతియుతంగా పయనిస్తూ నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకో వలన్నారు అన్నారు.. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా వినోద పిల్లలు పాల్గొన్నారు

# గిరిజన మోర్చా అధ్యక్షునిగా కేతావత్ మోహన్ నాయక్



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 02:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో.. బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి మాట్లాడుతూ... గిరిజనుల హక్కుల కోసం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసి వారికి అందుబాటులో ఉండాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి అన్నారు ఈరోజు మండల పార్టీ కార్యాలయంలో గిరిజన మోర్చా మండల అధ్యక్షునిగా మండల పరిధిలోని పెద్దమ్మతల్లి తండాకు చెందిన కేతావత్ మోహన్ నాయక్ ని మండల అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యల కోసం తండాల అభివృద్ధి కోసం పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నన్ను నమ్మి గిరిజన మోర్చా మండల అధ్యక్షులుగా బాధ్యత అప్పగించిన పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులకు మండల అధ్యక్షుని కి ధన్యవాదాలు తెలియజేశారు

# భాగ్యనగర్ స్కిల్ డెవలప్మెంట్ వింగ్ మంతెన అనిల్ కుమార్

**ఎల్బీనగర్ అక్టోబర్ 2**



నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి భాగ్యనగర్ స్కిల్డ్ డెవలప్‌మెంట్ వింగ్‌కు చెందిన మంతెన అనిల్ కుమార్ బీజేపీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్, శంభామూర్తి, గంటి నగేష్, ఆకుల శ్రీనివాస్‌లను కలిశారు. ఈ సందర్భంగా యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, కార్మికుల సంక్షేమంపై చర్చించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించి యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని వారు పేర్కొన్నారు.

# స్వచ్ఛతతో ఆరోగ్యకర సమాజం

## - సైకిల్ వినియోగంతో కాలుష్య నియంత్రణకు పిలుపు



**హనుమకొండ, అక్టోబర్ 2, హైదరాబాద్ ఎస్టేట్:**



గాంధీజీ ఆశయాల స్ఫూర్తితో ప్రతి ఇల్లు, వీధి పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు స్వచ్ఛతను పాటించాలని వరంగల్ జిల్లా సైకిల్ వాకర్స్ అసోసియేషన్ (303) అధ్యక్షుడు జంగ గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం హనుమకొండ ప్రతాపరుద్ర కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జల, వాయు కాలుష్యాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ సభ్యులు ప్రతిరోజూ సైకిళ్లపై ప్రయాణిస్తూ కాలుష్య నియంత్రణతో పాటు ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి. అనంత్‌కుమార్, పి. రమేష్, శేఖర్‌గౌడ్, వేణు, సత్యనారాయణ, ఆర్. లక్ష్మయ్య, కాలనీ వాసులు, వాకర్స్ పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
03,అక్టోబర్ శనివారం 2026

# ఈనెల 4న చలో శంషాబాద్ - మల్లేష్ యాదవ్

## ఓబిసి కులగనన సాధన సభను విజయవంతం చేయండి - మలేష్ యాదవ్

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 2**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ..ఈ నెల 4న శంషాబాద్‌లో ఓబీసీ కులగణన సాధన సభను విజయవంతం చేయండి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ పిలుపు జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలనే డిమాండ్‌తో టీపీసీసీఓబీసీ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన శంషాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు శంషాబాద్‌లోని గొల్లపల్లి రోడ్డులో ఈ సభ జరగనుందని పేర్కొన్నారు.జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన సాధన కోసం నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు, ఎన్ఎస్‌యూఐ, కిసాన్ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మల్లేష్ యాదవ్ కోరారు. బీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఈ సభను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు



# సిద్ధార్థ గురుకులంలో గాంధీ, శాస్త్రి జయంతి

## - విద్యార్థులు ఆదర్శాలను ఆచరించాలి




**చెన్నారావుపేట, అక్టోబర్ 2, హైదరాబాద్ ఎస్టేట్:**

చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల విద్యాలయంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ వీరమల్ల మాధవరెడ్డి, ప్రిన్సిపల్ ఏ. కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ చూపిన శాంతి, అహింసా మార్గం నేటి సమాజానికి ఆదర్శమన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి 'జై జవాన్‌జై కిసాన్' నినాదంతో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారని గుర్తుచేశారు. విద్యార్థులు మహనీయుల సేవా దృక్పథాన్ని, ఆశయాలను తెలుసుకుని దేశాభివృద్ధికి పాటుపడేలా తమ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా కృషి చేయాలి

## ఎడవెల్లి స్వామి ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గుట్టడిపో సెక్రటరీ

ఎల్బీనగర్, అక్టోబర్ 2:

టీఎస్ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా యూనియన్లు పనిచేయాలని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ఎడవల్లి లింగస్వామి అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు, గతంలో జరిగిన ఉద్యమాలు, వేతన సవరణలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కార్మికులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి గతంలో అశ్వత్థామ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు, వేతన సవరణలు తదితర అంశాలను ఈ సందర్భంగా లింగస్వామి ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికులను సమీకరించడంలో, కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 44 శాతం పీఆర్సీ, 16 శాతం ఐఆర్ వంటి అంశాలను సాధించడంలోనూ ఆయన నాయకత్వం ఉందని తెలిపారు.
ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు 2013 బాండ్ బకాయిల చెల్లింపు, 2017, 2021 వేతన సవరణలు, డీఏల అమలు, పీఎఫ్, సీసీఎస్ రుణాల సౌకర్యం, యూనియన్ హక్కుల పునరుద్ధరణ వంటి పలు చర్యలు చేపట్టిందని లింగస్వామి పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.
అదేవిధంగా ఉద్యోగ భద్రతతో కూడిన సంపూర్ణ విలీనం, మాస్టర్ పే స్కేల్, తార్నాక ఆస్పత్రి కొనసాగింపు, ఎలాంటి లోటుపాట్లు లేకుండా విలీనం వంటి అంశాలపై కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా స్పష్టమైన నిర్ణయాలు అవసరమన్నారు. యూనియన్ ఎన్నికలు, విలీనం తదితర అంశాలపై కార్మిక సంఘాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, వాటిని పక్కనపెట్టి కార్మికుల భవిష్యత్తు, సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు.కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమం వంటి అంశాలపై నిరంతరం పోరాడే సంఘాలకు కార్మికులు మద్దతు ఇవ్వాలని లింగస్వామి కోరారు. రాజకీయ, యూనియన్ విభేదాలకు అతీతంగా కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# గాంధీ ఆశయాలతో ఆరోగ్య సమాజ నిర్మాణం

## - యువత సత్యం, అహింస, సేవా మార్గాలను కొనసాగించాలి

## : డా. పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్



**నర్సంపేట, అక్టోబర్ 2, హైదరాబాద్ ఎస్టేట్:**

మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వాకర్స్ ఇంటర్నేషనల్ 303 గవర్నర్, నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నర్సంపేటలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, సమాజంలో ఐక్యత, సేవ, పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడకను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వాకర్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడెపు సదానందం, కోశాధికారి శంకినేని కృష్ణ, పాషా, సాంబయ్య, అశోక్, రామస్వామి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలతో గ్రామాభివృద్ధికి యువత భాగస్వామ్యం

## పెదకూరపాడులో ఘనంగా 'రిఫార్మ్ ఉత్సవ్ గ్రామసభ స్థాయిలో' కార్యక్రమం

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతిదీ పెద్దకూరపాడు అక్టోబర్ 2**

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్, గుంటూరు ఆధ్వర్యంలో, జన చైతన్య సమితి సహకారంతో 'రిఫార్మ్ ఉత్సవ్ గ్రామసభ స్థాయిలో' కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా జాతిపిత మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామసభల ప్రాధాన్యత, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, సామాజిక బాధ్యత, పరిశుభ్రత మరియు యువత పాత్రపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను చర్చించి, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో గ్రామసభలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న




ఇన్‌చార్జి ఎంఈఓ కె. వెంకట రమణ, మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి. శ్రీనివాసరావు, మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు, గ్రామ అవసరాలు మరియు సమస్యలను సంబంధిత వేదికలపై చర్చించే అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ కాకతీయ డిగ్రీ & జూనియర్ కళాశాల, డైరెక్టర్ డి. లలిత బాబు, జన చైతన్య సమితి, వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నీ బాబు, వెలితోటీ అనిల్ కుమార్, కోఆర్డినేటర్, జన చైతన్య సమితి, ఆర్. సాంబశివరావు, హెడ్‌మాస్టర్, ఎస్. సాంబశివరావు తదితరులు పాల్గొని తమ సందేశాలను అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు కార్యక్రమంలో పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలోకి తీసుకువస్తూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి యువత ముందడుగు వేయాలి అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లకు మరో అవకాశం

## - అక్టోబర్ 13 వరకు గడువు పొడిగింపు..

## - పలు డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

**బిచ్కుంద, అక్టోబర్ 2, హైదరాబాద్ ఎస్టేట్:**
అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 202627 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల గడువును అక్టోబర్ 13 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి. రమేష్ బాబు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఎంఏ, ఎం.కాం, బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 73829 29816 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# అభివృద్ధి బాటలో దాసర్లపల్లి

## - సిసి రోడ్డు పనులు వేగవతం

## దాసర్లపల్లి గ్రామ సర్పంచ్ టేకుమట్ల బాలరాజ్



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 02:)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో కందుకూరు మండల కేంద్రంలోని దాసర్లపల్లి గ్రామంలో.. సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని.. ప్రజలకి ప్రతినిత్యం అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని అన్నారు.
అభివృద్ధి బాటలో దూసుకెళ్తున్న గ్రామం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో.. ఐదు లక్షల రూపాయలతో సిసి రోడ్లో పనులు ప్రారంభించిన సర్పంచ్ టేకుమట్ల బాలరాజ్, ఉప సర్పంచ్ తాండ్ర నరసింహ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందూరి యుగంధర్ గౌడ్, మరియు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# గాంధీ విగ్రహ పునఃప్రతిష్ఠకు శ్రీకారం

## - రూ.25 వేలతో సర్పంచ్ తొలి విరాళం..

## - జనవరి 26లోగా పునఃప్రతిష్ఠకు కార్యాచరణ

**గీసుగొండ, అక్టోబర్ 2, హైదరాబాద్ ఎస్టేట్:**

గీసుగొండలో దెబ్బతిన్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించేందుకు గ్రామ ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా విగ్రహ పునఃప్రతిష్ఠకు తనవంతు సహకారంగా రూ.25 వేల విరాళాన్ని ప్రకటించారు. జనవరి 26 నాటికి కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించేలా చర్యలు చేపడతామని తెలిపారు. గతంలో గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గాంధీ విగ్రహం కాలక్రమేణా దెబ్బతిని, పలుమార్లు మరమ్మతులు చేసినా ప్రస్తుతం పూర్తిస్థాయిలో పునరుద్ధరించే పరిస్థితి లేదని సర్పంచ్ తెలిపారు. కొత్త విగ్రహం ఏర్పాటు, ఇతర ఏర్పాట్లకు సుమారు రూ.3 లక్షల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. ఇందుకు గ్రామ ప్రముఖులు, యువత, ఉద్యోగులు, వ్యాపారులు, దాతలు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన వారు తమవంతు సహకారం అందించాలని కోరారు. మహాత్మా గాంధీ ఆశయాలను స్మరించుకుంటూ గ్రామ ప్రజల భాగస్వామ్యంతో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కూట ప్రమోద్, గ్రామ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ కోల కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ పొగాకు బిక్షపతి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఆర్టీసీ ఎన్నికల్లో 'బాణం' గుర్తుకు ఓటు వేయాలి కేఎల్ఆర్

## కార్మికుల సమస్యలు, హక్కుల పరిరక్షణే లక్ష్యం : కెఎల్ఆర్



**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 2**

మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కే.ఎల్.ఆర్.),చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్, ఎన్నికల ఇంచార్జ్ బొంతు రామ్ మోహన్,యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అశ్వద్ధామ రెడ్డి,

మొగ్గుళ్ల రాజిరెడ్డిలు వెల్లడి

తెలంగాణ ఆర్టీసీ యూనియన్ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ ఇటుక్ , స్వ , తము , స్వప్ బలపరిచిన ట్వ తెలంగాణ ఆర్టీసీ ఫార్వ్యాన్ యూనియన్ అధ్యక్షులు గా ఉన్న మొగ్గుళ్ల రాజిరెడ్డి 'బాణం ' గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఆర్టీసీ కార్మికులు విజ్ఞప్తి

మహేశ్వరం ఆర్టీసీ డిపోలో ఐఎన్టీయూసీ తెలంగాణ వర్క్స్ యూనియన్ ఎన్నికల ప్రచారం ఉదయం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో ఐఎన్టీయూసీ (తెలంగాణ వర్క్స్ యూనియన్) ఆధ్వర్యంలో మహేశ్వరం ఆర్టీసీ డిపోలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ అభ్యర్థి మొగ్గుళ్ల రాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ, 'బాణం' గుర్తుకు ఓటు వేసి ఆయనను గెలిపించాలని నాయకులు కార్మికులను కోరారు.చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్, ఎన్నికల ఇంచార్జ్ బొంతు రామ్ మోహన్, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కే.ఎల్.ఆర్.), యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అశ్వద్ధామ రెడ్డి తదితరులు డిపోలోని కార్మికులను కలిసి ఎన్నికల్లో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కే.ఎల్.ఆర్) మాట్లాడుతూ... ఆర్టీసీ కార్మికులు సంస్థకు వెన్నెముకలాంటి వారన్నారు. ఎండ, వానను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులకు రవాణా సేవలు అందిస్తున్న కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ ఎన్నికలు కార్మికుల భవిష్యత్తుకు సంబంధించిన ముఖ్యమైన అంశమని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహేశ్వరం ఆర్టీసీ డిపోలో రానున్న మూడు నెలల్లో సీ సీ వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి హక్కుల కోసం బలంగా నిలబడే నాయకత్వం అవసరమని కే.ఎల్.ఆర్. అన్నారు. కార్మికుల ఐక్యతే వారి బలమని, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా కార్మికుల ప్రయోజనాల కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహేశ్వరం డిపో కార్మికుల సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను గౌరవిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా బొంతు రామ్ మోహన్ మాట్లాడుతూ....ఆర్టీసీ సంస్థను ముందుకు నడిపించడంలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రతిరోజూ ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ ఎన్నికలు కేవలం ఒక వ్యక్తిని ఎన్నుకునే ప్రక్రియ కాదని, కార్మికుల సమస్యలను బలంగా వినిపించే నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం అని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్టీసీ యూనియన్ ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ ఇటుక్ , స్వ , తము , స్వప్ బలపరిచిన ట్వ తెలంగాణ ఆర్టీసీ ఫార్వ్యాన్ యూనియన్ గెలిపించాలన్నారు.

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఐఎన్టీయూసీ తెలంగాణ వర్క్స్ యూనియన్ తరఫున మొగ్గుళ్ల రాజిరెడ్డి ప్రెసిడెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఆయనకు మద్దతుగా కార్మికులు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్మికుడు ఎన్నికల్లో పాల్గొని 'బాణం' గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం..ఈ సందర్భంగా అభ్యర్థి మొగ్గుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, హక్కులు, సంక్షేమం కోసం అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థను నడిపించే అసలైన బలం ఉద్యోగులేనని పేర్కొన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, అధికారులు, ఇతర ఉద్యోగులు ఎండ, వాన, పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను క్రమబద్ధంగా గుర్తించి, సంఘటితంగా చర్చల ద్వారా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని రాజిరెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లపై పని ఒత్తిడి, డ్యూటీకి సంబంధించిన సమస్యలపై చర్చిస్తామని చెప్పారు.ఉద్యోగుల సంక్షేమం, వైద్య సదుపాయాలు, కుటుంబ సంక్షేమ అంశాలపై దృష్టి పెట్టడంతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానన్నారు. మహిళా ఉద్యోగుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, ఉద్యోగుల అభిప్రాయాలను యూనియన్ నిర్ణయాల్లో భాగం చేస్తామని తెలిపారు. ప్రతి డిపో, ప్రతి విభాగం నుంచి వచ్చే సమస్యలకు సమాన ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

"పదవి అనేది అధికారం కోసం కాదు.. బాధ్యత కోసం" అని రాజిరెడ్డి అన్నారు. ప్రెసిడెంట్‌గా బాధ్యత తీసుకుంటే ఉద్యోగుల సమస్యలను తన సమస్యలుగా భావించి, అందుబాటులో ఉంటూ పనిచేయాలన్నదే తన ఉద్దేశమని తెలిపారు. ఉద్యోగుల సమస్యల విషయంలో అందరూ ఐక్యంగా ఉండాలని, వారి సూచనలు, సమస్యలు, అభిప్రాయాలను వినే సంఘంగా యూనియన్‌ను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనం చేయడమే తమ లక్ష్మన్నారు. "ఆర్టీసీ బలంగా ఉండాలంటే ఉద్యోగి బలంగా ఉండాలి. ఉద్యోగి గౌరవంగా ఉండాలంటే అతని సమస్యకు గళం ఉండాలి" అని రాజిరెడ్డి పేర్కొన్నారు.మహేశ్వరం ఆర్టీసీ డిపోలోని కార్మికులందరూ ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 'బాణం' గుర్తుకు ఓటు వేసి మొగ్గుళ్ల రాజిరెడ్డికి మద్దతు ఇవ్వాలని ఐఎన్టీయూసీ తెలంగాణ వర్క్స్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# యం.పీ.డీ.ఓ ఆధ్వర్యంలో ఘనంగా గ్రామసభ

**కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ అక్టోబర్ 2:**

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని బుజరంపేట్ గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభను నిర్వహించారు. యం.పీ.డీ.ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామసభలో గ్రామ అభివృద్ధి, ఉపాధి హామీ పనులు, గ్రామస్తుల అవసరాలు, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా యం.పీ.డీ.ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టేందుకు మొత్తం 375 రకాల పనులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈ నెల 30వ తేదీలోపు పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని సూచించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసుకుని ప్రాధాన్యత క్రమంలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా గ్రామస్తులు ఉపాధి హామీ పనులకు సంబంధించి తమ డిమాండ్‌ను అందించాలని సూచించారు. గ్రామంలో అవసరమైన వారికి ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. సంవత్సరంలో 365 రోజుల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు పొందే క్రమంలో 60 రోజుల వరకు సెలవు అవకాశం ఉంటుందని గ్రామస్తులకు వివరించారు.అలాగే గ్రామంలో నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని యం.పీ.డీ.ఓ శ్రీనివాస్ సూచించారు. ప్రతి ఇంటి వద్ద, అవసరమైన ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.గ్రామసభలో గ్రామస్తులు తమకు అవసరమైన అభివృద్ధి పనులు, ఉపాధి అవకాశాలు, గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, అవసరాలను పరిశీలించి సంబంధిత



పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ కౌడిపల్లి గోపాల్, పంచాయతి సెక్రటరీ రత్నం, వార్డ్ మెంబర్స్ అమృత లక్ష్మయ్య, ఆంజనేయులు, సురేష్, పెంటయ్య, రాములు, వైష్ణవి అశోక్, శ్రీనివాస్, విజయ చంద్రయ్య, వెంకటలక్ష్మి, నాయికోటి లింగం, సంద్రు యాదగిరి,సంద్రు బీరప్ప, ఆకుల శేఖర్, గాజుల శ్రీను పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పనులను ప్రాధాన్యతతో చేపట్టేందుకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

## అక్టోబరు 13 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం.. వాయుగుండంగా మారే చాన్స్

నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది. అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు.

కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 – సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9



శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# కల్యాణలక్ష్మికి 12 ఏళ్లు

## - పథకం కొనసాగింపుపై దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్..

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**హనుమకొండ, అక్టోబర్ 2, హైదరాబాద్ ఎస్టేట్:**

కల్యాణలక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హనుమకొండ వడ్డేపల్లి జంక్షన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక అండగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో వివాహ ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా పేద కుటుంబాలకు ఉపయోగపడుతున్న సంక్షేమ పథకాల కొనసాగింపుపై దృష్టి పెట్టాలని, కల్యాణలక్ష్మి వంటి పథకాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా వంటి పథకాల ద్వారా గతంలో పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కబడ్డీ క్రీడాకారులకు కిట్లు

## - గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించాలి

## సూరపనేని నాగేశ్వరరావు



**మల్లంపల్లి, అక్టోబర్ 2, హైదరాబాద్ ఎస్టేట్:**

ములుగు జిల్లా జూనియర్, సబ్‌జూనియర్ కబడ్డీ ఎంపికల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులకు భవిత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కత్తి మొగిలిగౌడ్ తల్లి కత్తి బుచ్చమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం కబడ్డీ కిట్లు, టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్మ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు సూరపనేని నాగేశ్వరరావు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూక్య రవీందర్, జనరల్ సెక్రటరీ పోలెపాక జనార్ధన్ పాల్గొని క్రీడాకారులకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని క్రీడాకారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ములుగు జిల్లా కబడ్డీ క్రీడాకారులకు అవసరమైన మ్యాట్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కత్తి మొగిలిగౌడ్, ముచ్చ రాజేందర్, ఆక రవి, పూరం ప్రసాద్, తౌటం శంకర్, చెలిమల సురేందర్, నూనావత్ శ్రవణ్, బత్తిని సురేష్, బైకని రాజు, జోగు రాజన్న, చింత కృష్ణ పాల్గొన్నారు.

## పడమటి తండాలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

## గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసిన సర్పంచ్

## గ్రామాభివృద్ధే లక్ష్యం: సర్పంచ్ వినోద్ రాథోడ్



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి అక్టోబర్ 02:)**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం పడమటి తండా గ్రామంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ దేశానికి చేసిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను వివరించారు. సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారంతో నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ వినోద్ రాథోడ్ తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో....పడమటి తండా సర్పంచ్ వినోద్ రాథోడ్, ఉప సర్పంచ్ రాజు నాయక్ వార్డు సభ్యులు శ్రీను, బాబూలాల్, తిరుపతి,రమేష్,బుజ్జి, సేవ్య,రాజేష్ మరియు సెక్రటరీ సుభద్రాదేవి మరియు గ్రామ పెద్దలు భాస్కర్,అంగన్వాడీ టీచర్, ఆశ వర్కర్ మరియు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు

# తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ భాషా మైనారిటీ నాయకుల సమావేశం




**హైదరాబాద్, అక్టోబర్ 02:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ భాషా మైనారిటీస్ విభాగానికి చెందిన ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టీపీసీసీ భాషా మైనారిటీస్ అధ్యక్షులు రాకేష్ కుమార్ అగర్వాల్, మాజీ అధ్యక్షులు హృదయనాథ్ సింగ్, మరియు టీపీసీసీ భాషా మైనారిటీస్ ప్రధాన కార్యదర్శి హరాస్ వాలే హరి తిలక్ సింగ్ కాచి పాల్గొని మాట్లాడారు. భాషా మైనారిటీల సంక్షేమం, పార్టీ బలోపేతం మరియు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ సందర్భంగా నాయకులు చర్చించారు. భాషా మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు తెలిపారు.

# దాదాపు 30 సంవత్సరాల పాటు సేవలందించిన పాల్వాయి సత్యనారాయణ రెడ్డికి సంతాప సభ



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్**

చందూరు మండలం బంగారిగడ్డ గ్రామ సర్పంచ్‌గా సుదీర్ఘకాలం పాటు, దాదాపు 30 సంవత్సరాల పాటు మన గ్రామానికి అంకితభావంతో నిస్వార్థ సేవలందించిన శ్రీ పాల్వాయి సత్యనారాయణ రెడ్డి గారు పరమపదించడం మన గ్రామానికి తీరని లోటు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈరోజు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోయపల్లి సునీత శ్రీను గారి ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించి, వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గారు, పెద్దలు మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి శ్రీ సత్యనారాయణ రెడ్డి గారు చేసిన విశేష కృషిని, ప్రజలకు అందించిన చిరస్మరణీయ సేవలను కొనియాడారు. వారి ఆదర్శాలు, సేవా భావం భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ ప్రజలు మరియు గ్రామ స్థాయి అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. ఓం శాంతి.

# తెలంగాణలో ఆటో చార్జీల పెంపు.. ఇక మీటర్ లెక్క ఇదే



హైదరాబాద్ స్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్

రాష్ట్రంలో ఆటో రిక్షా ప్రయాణ చార్జీల సవరణకు సంబంధించి నూతన నిబంధనలు రుసుముల వివరాలను ప్రభుత్వం సవరించింది. ప్రయాణికులపై పడే భారాన్ని ఆటో డ్రైవర్ల నిర్వహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని కొత్త విధానాన్ని ఖరారు చేశారు. నూతన నిబంధనల ప్రకారం తొలి 1.6 కిలోమీటర్ల ప్రయాణానికి కనీస చార్జిగా రూపాయలు.30 నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటర్ కు రూపాయలు 14 చొప్పున వసూలు చేయనున్నారు. ఇక ప్రయాణంలో ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల వాహనం నిలిచిపోయినప్పుడు వర్తించే వెయిటింగ్ చార్జీలను నిమిషానికి 75 పైసలుగా నిర్ణయించారు.

# భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి....

## సమ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు బులుగూరి కిరణ్ కుమార్



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి నల్గొండ**

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘం నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తూ "సర్ " ప్రక్రియ ద్వారా లక్షలాదిమంది పేద ప్రజల ఓట్లను ఏకపక్షంగా తొలగిస్తూ ఓటు చోరుకి పాల్పడుతున్నారు. పేద ప్రజల ఓటు హక్కును తొలగించడం అంటే వారి ప్రాథమిక హక్కులను, వారి పౌరసత్వాన్ని భంగపరచడమే. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. భారతదేశ అస్తిత్వాన్నే దెబ్బతీయడం అవుతుంది. సర్ ప్రక్రియ ద్వారా తొలగించిన ప్రతి ఒక్క ఓటును తిరిగి పునరుద్ధరించాలి. సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. ఈవీఎం లను రద్దు చేయాలి. బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలను నిర్వహించాలి. సీఈసీ జ్ఞానేష్ కుమార్ తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ పద్ధతులలో కొనసాగించిన అన్ని ఎన్నికల పై పూర్తిస్థాయి విచారణ జరగాలి. ఎన్నికల ప్రక్రియపై సర్ ప్రక్రియ ద్వారా ఓట్ల తొలగింపు పై పూర్తిస్థాయిలో విచారణ జరగాలి. ఎన్నికల ప్రక్రియలో ఓట్ల తొలగింపులో జరిగిన అక్రమాలపై పూర్తి బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ప్రజా ఆందోళనలు, పోరాటాలు ఉధృతమవుతాయని హెచ్చరిస్తున్నాము. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వాలే వహించవలసి వస్తుందని తెలియజేస్తున్నాము.

ఉద్యమాభినందనలతో....

-ఏ బొల్గూరి కిరణ్ కుమార్, సమ సమాజ్ పార్టీ (SSP) జాతీయ అధ్యక్షులు. జవశ్రీశ్రీ: 9059816466, 9398680827.

# జోయాలుక్కాస్ వరంగల్ షోరూమ్, 2026 అక్టోబర్ 2 నుండి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'తో మెరిసిపోనుంది.

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**



**వరంగల్, తెలంగాణ అక్టోబర్ 2026:** జోయాలుక్కాస్, ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్ వరంగల్‌లోని విజయ టాకీస్ ఎదురుగా ఉన్న తమ షోరూమ్‌లో అక్టోబర్ 2, 2026 నుండి 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'తో తెలంగాణను మెరిపించడానికి సిద్ధమైంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రదర్శన, వజ్రాభరణాలలో నైపుణ్యం, సొబగులు, సరికొత్త ఆవిష్కరణల అపురూప వేడుకను అందిస్తుంది.

పెళ్లిళ్ళకు వాడే అద్భుతమైన నగల సెట్‌ల నుండి నిత్యం ధరించే ఆధునిక ఆభరణాల వరకు, ఈ షోలో కాలాతీతమైన సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ఆభరణాలు లభ్యమవుతాయి. ప్రతి డిజైన్ ఒక కళాఖండం, ఈ షో జరిగే పరిమిత కాలం వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ మరియు వీణ అయిన డాక్టర్ జోయ్ అలుక్కాస్ ఇలా అన్నారు: "బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో అనేది వజ్రాల శాశ్వతమైన ఆకర్షణకు మరియు ఆభరణాల రూపకల్పనలో మా పరిపూర్ణతకు నివాళి. తెలంగాణ మా ప్రయాణంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది, మరియు పండుగల సమయంలో జరిగే ఈ ప్రదర్శన వినియోగదారులకు అందం, ప్రత్యేకత మరియు అత్యుత్తమ కళాత్మకతను ప్రతిబింబించే డిజైన్‌లను కనుగొనడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది."

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రదర్శన సమయంలో 1 లక్ష రూపాయలు మరియు అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలు కొనుగోలు చేసిన ప్రతి వినియోగదారుడికి ఒక ఉచిత బంగారు నాణెం లభిస్తుంది. ఇది షాపింగ్ అనుభవానికి మరింత మెరుపును జోడిస్తుంది.

అత్యంత ప్రత్యేకంగా నిర్వహించబడుతున్న 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' తెలంగాణలోని వరంగల్, విజయ టాకీస్ ఎదురుగా ఉన్న షోరూమ్‌లో 2026 అక్టోబర్ 18 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. సందర్శకులను వజ్రాల అద్భుతమైన ప్రపంచాన్ని అన్వేషించడానికి ఆహ్వానిస్తున్నాము, ఇక్కడ ప్రతి ముక్క విలాసం, ప్రేమ మరియు కాలాతీతమైన ఆకర్షణ కథను చెబుతుంది.

# పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొనండి..

## గ్రాడ్యుయేట్స్ జేఏసీ చైర్మన్ ఉప్పుసత్యనారాయణ.

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్**



వనస్థలిపురం, అక్టోబర్ 2: అతి త్వరలో జరగనున్న మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఓటరు నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పట్టభద్రుల జేఏసీ చైర్మన్ ఉప్పు సత్యనారాయణ కోరారు. ఇప్పటికే ఓటరు నమోదు కార్యక్రమానికి అనూహ్యంగా స్పందన వస్తున్నదని, ఈ ఒరవడిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు చైతన్య కార్యక్రమంలో భాగంగా వనస్థలిపురం లోని ప్రొఫెసర్ జయశంకర్ పార్క్ లో జయశంకర్ యోగ గ్రూప్ సభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ 6 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి అవకాశం ఉంటుందని, ఇట్టి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. విజ్ఞానవంతులైన పట్టభద్రులకు ప్రత్యేకంగా ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉండటం శుభ పరిణామమని చెప్పారు. పట్టభద్రులు ఓటర్లుగా నమోదైతే చట్టసభలలో విద్యావంతుల సంఖ్య పెరుగుతుందని, తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రిటైర్డ్ పెన్షనర్లు, ఉపాధ్యాయ, ఉద్యోగస్తులకు పిఆర్సి, డిఏలు ఇతర హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం లభిస్తుందని ఉప్పు సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ యోగ గ్రూప్ సభ్యులు మామిడి కరుణాకర్ రెడ్డి, యోగ మాస్టర్ రామకృష్ణ రెడ్డి, సూరిబాబు, అంపిరెడ్డి, ఆర్ కె, వెంకన్న, అలీం, సత్తయ్య, వేణు, సుధాకర్, రాములు, శ్రీనివాస్ రావు, సుధాకర్ రెడ్డి, రాంరెడ్డి, సంపత్ రెడ్డి, అశోక్, నీలగిరి ఎక్స్ ప్రెస్ దినపత్రిక సంపాదకులు కండె వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జాతిపిత గాంధీజీ మరియు పూర్వ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి ల జయంతుల సందర్భంగా జయశంకర్ యోగ గ్రూప్ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

# గాంధీజీ చూపిన మార్గంలో నడవాలి..

## గాంధీ కంటే గాడ్సే గొప్పవాడు అనడం బాధాకరం..

## దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకోవాలి: ఎమ్మెల్యే నాయిని

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**
**తేదీ:02/10/2026-శుక్రవారం హనుమకొండ జిల్లా.**



మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ ఇనగల వెంకట్రామ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు,వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, సత్య శారదలతో కలిసి ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ దేశానికి సత్యం, అహింస, శాంతి, ఐక్యత మార్గాలను చూపించిన మహనీయుడని అన్నారు. ప్రజలందరూ ఐక్యంగా ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలమనే నమ్మకాన్ని గాంధీజీ దేశ ప్రజల్లో కల్పించారని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం, ఆయన చేసిన సేవలు, త్యాగాలు భారత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గాంధీజీ చూపించిన మార్గం వల్లనే ప్రజలందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య ఉద్యమాన్ని విజయవంతం చేయగలిగామని తెలిపారు.అయితే ప్రస్తుతం బీజేపీ పార్టీ గాంధీజీని తక్కువ చేసి చూపించే విధంగా ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే నాయిని అన్నారు. గాంధీజీ విగ్రహాలకు నివాళులు అర్పిస్తూ మరోవైపు సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి వేదికలలో గాంధీ కంటే గాడ్సే గొప్పవారిగా చూపించే ప్రయత్నాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, సేవలను ఎవరెన్ని విధాలుగా ప్రచారం చేసినా చరిత్ర నుంచి చెరిపివేయడం సాధ్యం కాదన్నారు.

గాంధీజీ కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని అన్నారు. దేశం కోసం సేవ చేసిన ఆ కుటుంబం వ్యక్తిగత ఆస్తులు, సంపద కోసం ఎన్నడూ పోరాటం చేయలేదని, దేశ ప్రయోజనాలకే తమ జీవితాలను అంకితం చేశారని పేర్కొన్నారు. అలాంటి మహనీయుల కుటుంబాలను ఆదర్శంగా తీసుకుని, సమాజానికి ఉపయోగపడే విధంగా మనమంతా పనిచేయాలని పిలుపునిచ్చారు.దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గాంధీజీ ఆశయాలైన సత్యం, అహింస, సామాజిక సమానత్వం, దేశ ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు.అదేవిధంగా మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను ఎమ్మెల్యే స్మరించుకున్నారు. నిరాడంబరత, దేశభక్తి, కర్తవ్యనిబద్ధతకు లాల్ బహదూర్ శాస్త్రి ప్రతీకగా నిలిచారని అన్నారు. గాంధీజీ, శాస్త్రిజీ వంటి మహనీయుల జీవితాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక్,గూాఎం చైర్మన్ వెంకట్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

